# శ్రీదామోదరాష్టకం

నమామీశ్వరం సచ్చిదానందరూపం లసత్కుండలం గోకులే భ్రాజమానం |
యశోదాభియోలూఖలాద్ధావమానం పరామృష్టమ్ అత్యంత తో ద్రుత్య గోప్యా || 1 ||

రుదంతం ముహుర్నేత్రయుగ్మం మృజంతం కరాంభోజ - యుగ్మేన సాతంకనేత్రం |
ముహుశ్వాస కంప – త్రిరేఖాంకకంఠ-స్థితగ్రైవం దామోదరం భక్తి బద్ధం || 2 ||

ఇతీదృక్ స్వలీలాభిరానన్ద కుండే స్వఘోషం నిమజ్జంతమాఖ్యాపయంతం |
తదీయే శితజ్ఞేషు భక్తైర్జితత్వం పునః ప్రేమతస్తం శతావృత్తి వందే || 3 ||

వరం దేవ! మోక్షం న మోక్షావధిం వా న చాన్యం వృణేఽహం వరేశాదపీహ |
ఇదం తే వపుర్నాథ గోపాల బాలం సదా మే మనస్యావిరాస్తాం కిమన్యైః || 4 ||

ఇదం తే ముఖాంభోజమత్యంతనీలై- ర్వృతం కుంతలైః స్నిగ్ధరక్తైశ్చ గోప్యా |
ముహుశ్చుమ్బితం బింబరక్తాధరం మే మనస్యా విరాస్తామలం లక్షలాభైః || 5 ||

నమో దేవ దామోదరానంత విష్ణో ప్రసీద ప్రభో దుఃఖ జాలాబ్ధిమగ్నం |
కృపాదృష్టి వృష్ట్యాతిదీనం బతాను- గృహాణేశ మామజ్ఞమేధ్యక్షిదృశ్యః || 6 ||

కుబేరాత్మజౌ బద్ధమూర్త్యైవ యద్వత్ త్వయామోచితౌ భక్తిభాజౌకృతౌ చ |
తథా ప్రేమభక్తిం స్వకాం మే ప్రయచ్ఛ న మోక్షే గ్రహో మేఽస్తి దామోదరేహ || 7 ||

నమస్తేఽస్తు దామ్నే స్ఫురదీప్తి ధామ్నే త్వదీయోదరాయాథ విశ్వస్య ధామ్నే |
నమో రాధికాయై త్వదీయప్రియాయై నమోఽనంత లీలాయ దేవాయ తుభ్యం || 8 ||

ఇతి శ్రీదామోదరాష్టకం సంపూర్ణం ||

(1) శాశ్వతమైన ఉనికి కలవాడు, పరమజ్ఞాన స్వరూపుడు మరియు పరమానంద స్వరూపుడు, సొర చేప ఆకృతిలో ముందుకు వెనుకకు ఊగుచున్న చెవి లోలకులు కలిగి ఉన్నవాడు, దివ్యధామమైన గోకులములో ఎంతో సౌందర్యవంతముగా ప్రకాశించువాడు, యశోదమాత చిలుకుతున్న వెన్న కుండను పగులగొట్టి, ఉట్టికి కట్టిన వెన్న కుండలో నుండి వెన్నను దొంగిలించుటమనే అపరాధము చేయుటచే భయపడి చెక్కరోలు నుండి పరుగెత్తువాడు, కాని అతనికంటే వేగంగా వెంట బడిన యశోదమాతచే పట్టుబడినవాడైన అట్టి దేవదేవుడైన శ్రీ దామోదరునికి నా వినయ పూర్వక ప్రణామములు.

(2) (తల్లి చేతిలో కర్రను చూసి) అతడు ఏడుస్తూ, తన రెండు కళ్ళను కమల హస్తాలతో మరల మరల నులుముకుంటున్నాడు. అతడి కళ్ళు భయముతో కూడి ఉన్నాయి, మరియు అతడి మెడలోని (శంఖమువలే మూడు గీతలు ఉన్నటువంటి) ముత్యాల హారము అతడు ఏడ్వటం వలన, త్వరితగతిన ఊపిరి పీల్చుకోవటం వలన ఊగుతూ ఉంది. అతడి ఉదరము తాడు చేతకాక, తన తల్లి యొక్క విశుద్ధ ప్రేమ చేత కట్టబడింది. అటువంటి దేవదేవుడైన శ్రీదామోదరునికి నా వినయ పూర్వక ప్రణామములు.

(3) ఇటువంటి బాల్య లీలల చేత గోకులవాసులను పారవశ్యపు మడుగులలో ముంచెత్తుతున్నాడు. గౌరవ ప్రపత్తులు మిశ్రితము కాని, అన్యోన్య విశుద్ధ ప్రేమ గాఢముగా గల భక్తులకు, అతడు వశమవుతాడని మహోన్నత దివ్య విజ్ఞానము కలిగిన భక్తులకు ఈ విధముగా అభయ మిస్తున్నాడు. అట్టి దామోదర భగవానునికి మిక్కిలి ప్రేమతో నేను మరల అనేక వందల కొలది సార్లు ప్రణామాలర్పిస్తున్నాను.

(4) ఓ దేవా! నీవు అన్ని రకాల వరములు ఇవ్వటానికి సమర్ధుడవైనప్పటికీ, నేను నిరాకార ముక్తిని గాని, వైకుంఠములో శాశ్వత జీవితము నిచ్చే సర్వోత్తమ ముక్తిని గాని, నవ విధ భక్తి ద్వారా పొందదగిన మరెటువంటి వరమును కోరను. ఓ స్వామీ! నేను కేవలం వృందావనములో బాలగోపాలునిగా ఈ నీ రూపము సర్వదా నా హృదయంలో ప్రకటితము కావాలని కోరుకుంటున్నాను. ఎందువలనంటే ఇంతకంటే మరే వరమైనను నాకేమి ప్రయోజనము?

(5) ఓ స్వామీ, నీ మెత్తని నల్లని కురులతో చుట్టబడిన నీ ముఖ పద్మమును యశోదమాత మళ్ళీ మళ్ళీ ముద్దులాడుతోంది. మరియు నీ పెదవులు బింబా ఫలము వలే ఎర్రగా నున్నవి. నీ ముఖ పద్మము యొక్క ఈ సుందర దృశ్యం నా హృదయంలో సదా ప్రకటితమగు గాక! నాకు వేలకు వేల ఇతర వరముల ఉపయోగమేమీ లేదు.

(6) ఓ దేవాదిదేవా! నేను నీకు నా ప్రణామములర్పించు చున్నాను. ఓ దామోదరా! ఓ అనంతా! ఓ విష్ణో! ఓ ప్రభూ! ఓ నా స్వామీ, నా పై కృప జూపుము. నాపై నీ కృపా దృష్టి వర్షించి, ప్రాపంచిక దుఃఖ సాగరములో మునిగిన ఈ మూర్ఖుని దరిచేర్చి నా కళ్ళకు దర్శనమివ్వు.

(7) ఓ దామోదరా! ఏ విధముగానైతే నీవు చెక్క రోటికి కట్టబడిన తర్వాత కుబేరుని ఇద్దరు పుత్రులైన నలకుబేర, మణిగ్రీవులను నారదుని శాపము నుండి విముక్తి కలిగించి మహాభక్తులుగా మార్చావో, అదే విధముగా నాకు నీ యొక్క ప్రేమ భక్తిని ప్రసాదించుము. నేను కేవలం దీనికై పరితపిస్తున్నాను. నాకు మరే రకమైన ముక్తి పైన కోరికలేదు.

(8) ఓ దామోదరా! ముందుగా నీ ఉదరమునకు కట్టుబడిన దేదీప్యమానమైన త్రాడుకు నా ప్రణామములు అర్పిస్తున్నాను. తరువాత విశ్వమంతటికీ నెలవైన నీ ఉదరమునకు నా ప్రణామములు అర్పిస్తున్నాను. నీకు మిక్కిలి ప్రియమైన శ్రీమతి రాధారాణికి నా వినయ పూర్వక ప్రణామములు మరియు అనంత లీలలను ప్రదర్శించే, దేవాదిదేవుడైన నీకు నా సమస్త ప్రణామములు అర్పిస్తున్నాను.